క్లుప్తంగా

కట్టడం ఇలా.. నీరు పోయేదెలా?

కాల్వలో అక్రమంగా ప్రహరీ నిర్మాణం



సూరం చెరువు కాల్వలో నిర్మిస్తున్న ప్రహరీ

తుక్కుగూడ: రియల్టర్ల కబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. తమకు అనుకూలంగా ఉన్న వాటిని స్వాహా చేస్తున్నారు. ఏకంగా చెరువు కాల్వను కబ్జాచేసి ప్రహరీ నిర్మిస్తున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని మంఖాల్ రెవెన్యూ పరిధి సూరం చెరువు నుంచి వరద నీరు శ్రీశైలం జాతీయ రహదారి గుండా సమీపంలోని బొమ్మలకుంట వాగుకు చేరుకుంటుంది. అయితే శ్రీశైలం ఎన్‌హెచ్‌పై ఉన్న బ్రిడ్జి వద్ద వరద నీరు పోకుండా కాల్వలో అడ్డుగా గోడ నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని, కాల్వను పునరుద్ధించాలని కోరుతున్నారు.

పశు వైద్య సేవలను వినియోగించుకోండి

కందుకూరు: ప్రభుత్వం అందించే ఉచిత పశు వైద్య సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి రాచులూరు వైద్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మాదాపూర్‌లో మైత్రి సెంటర్‌ను ప్రారంభించారు. టెక్నిషియన్ ఎ.శివకుమార్ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణతో ఆడ దూడలు పుడతాయని, ఆ వీర్యం అందుబాటులో ఉందని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దీంతో పాడి అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షాహిన్‌షేక్, వీఏఎస్ ఏ.రమేష్, శివకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

జాగృతి జిల్లా అధ్యక్షురాలికి పరామర్శ



పావనిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మీర్‌పేట: కేన్సర్‌తో బాధపడుతున్న తెలంగాణ జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలు మిర్యాల పావనిని శుక్రవారం మీర్‌పేట ప్రశాంతిహిల్స్‌లోని ఆమె నివాసంలో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు.ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పావని వైద్యానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. కవిత వెంట బీఆర్‌ఎస్ మీర్‌పేట అధ్యక్షుడు కామేష్ రెడ్డి,మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు రాజ్‌కుమార్, శ్రీనునాయక్, నవీన్, అవినాశ్, ప్రభాకర్, రమణ్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కేఎల్లార్ కృషి అభినందనీయం

కందుకూరు: మండల పరిధి గుమ్మడవెల్లి గ్రామాభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ సంపూర్ణ సహకారం అందించడం అభినందనీయమని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ జీవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన కేఎల్లార్.. గుమ్మడవెల్లి నుంచి తిమ్మాపూర్ వరకు రోడ్డు విస్తరణతో పాటు శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం, పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయం పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కేఎల్‌ఆర్ చూపుతున్న చొరవకు గ్రామస్తుల తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సేవాలాల్ మహారాజ్ జయంతి

మహేశ్వరం: మండల పరిధి ఉప్పుగడ్డతండా సేవాలాల్ మహారాజ్, జగదాంబ ఆలయంలో శనివారం సేవాలాల్ జయంతి నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ సీతారామ్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు ఆలయంలో జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పి.కార్తీక్ రెడ్డిలు హాజరుకానున్నారని వెల్లడించారు. బంజార సంఘం నాయకులు, సేవాలాల్ ఆలయ కమిటీ సభ్యులు, బంజారలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇరుకు రోడ్డుకు మోక్షం

- తీరనున్న రవాణా కష్టాలు
- వేగంగా కొనసాగుతున్న విస్తరణ పనులు
- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు బీటీ నిర్మాణం
- రూ.5.65 కోట్లతో 2.1 కి.మీ రోడ్డు
- త్వరలో వినియోగంలోకి తెస్తామన్న అధికారులు



నాగారం- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు కొనసాగుతున్న బీటీ నిర్మాణ పనులు

మహేశ్వరం: ఎట్టకేలకు ఇరుకైన గుంతల రోడ్డుకు మోక్షం లభించింది. చాలా కాలంగా నిర్మాణ పనులు నీరసించినప్పటికీ.. ప్రజల డిమాండ్, ప్రజాప్రతినిధుల చొరవతో బీటీ పనులు పరుగులు తీస్తుండటంతో.. వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. కొత్తగా రహదారి, ఆపై విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతుండటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధి నాగారం- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి 2.1 కిలో మీటర్ల దూరానికి 33 ఫీట్ల వెడల్పు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.65 కోట్ల నిధులను మంజూరు చేసింది. గతంలో ఈ మార్గం 20 ఫీట్ల వెడల్పు ఉండేది. ప్రస్తుతం 33 ఫీట్ల విస్తరణ, రోడ్డుకు ఇరు వైపులా 5 ఫీట్ల సైడ్ బర్మ్ నిర్మిస్తున్నారు. పనులను ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు, డీఈ, ఏఈలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

సరిపడా నిధులు లేక!

రహదారి వినియోగంలోకి వస్తే మహేశ్వరం మండలంతో పాటు కేశంపేట్, కందుకూరు మండలాల ప్రజలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి వెళ్లడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. మండల కేంద్రం నుంచి మన్సాన్‌పల్లి కూడలి, నాగారం వరకు రోడ్డు నిర్మాణం వెడల్పుగా ఉంది. నాగారం నుంచి పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గం గుండా మహేశ్వరం డిపో నుంచి శంషాబాద్, అఫ్జల్‌గంజ్‌కి ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో రహదారి విస్తరణకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు అయ్యాయి. కానీ బిల్లులు సరిగా రాకపోవడంతో పనులు నీరసించాయి. ఇదే విషయమై బీఆర్‌ఎస్ నాయకులు కొందరు.. ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తేగా.. ఆమె ఆర్అండ్‌బీ అధికారులు, నిర్మాణదారుడితో ఫోన్లో మాట్లాడారు. ప్రజా రవాణాను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులు పూర్తి చేసి, రోడ్డును వినియోగంలోకి తేవాలని ఆదేశించారు.

పూర్తయితే బాగుంటుంది



ఇరుకు ఆపై గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. నిత్యం అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుత విస్తరణ పనులు పూర్తయితే.. రవాణా మార్గం సౌకర్యవంతంగా ఉంటుంది. పనుల గురించి ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

– మంచె పాండు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్, మహేశ్వరం

త్వరగా పూర్తి చేస్తాం

నాగారం- పెద్ద గోల్కొండ ఔటర్ వరకు 2.1 కిలో మీటర్ల దూరం బీటీని నిర్మిస్తున్నాం. బిల్లులు ఆలస్యం కావడంతో పనులు నెమ్మదించాయి. రోడ్డుకు ఇరువైపులా మట్టి, కంకర, డస్ట్ పోసి సమాంతరం చేస్తున్నాం. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నాం. వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం.

– రవీందర్ గౌడ్, ఆర్అండ్‌బీ డీఈ, మహేశ్వరం



ఇళ్ల మధ్య పొంచి ఉన్న ప్రమాదం

కొత్తూరు: మండల కేంద్రంలోని నారాయణ గూడ కాలనీలో ప్రధాన రోడ్డు పక్కన ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం ట్రాన్స్‌ఫార్మర్ సమీపం నుంచే వందలాది మంది సంచరిస్తుంటారని తెలిపారు. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలకు గురయ్యే అవకాశం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు సంబంధిత శాఖలకు చెందిన అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధి కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్, టీ.ఎస్.హౌసింగ్‌బోర్డు ఫీడర్ల కింది కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ జైపురికాలనీ, రాజీవ్ స్వగృహ- ఏ,బీ,సీ,డీ బ్లాకులు, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 11కేవీ పెద్దఅంబర్‌పేట ఫీడర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నామని వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి



అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, నిధులతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో చేస్తున్న అభివృద్ధి పనుల వివరాలను అందచేయాలని దిశ కమిటీ జిల్లా సభ్యుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి 2025 వరకు అమృత్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్, స్మార్ట్ సిటీ మిషన్‌లతో పాటు ఇతర పథకాల ద్వారా వచ్చిన నిధులతో కార్పొరేషన్‌లో చేసిన అభివృద్ధి, ఇతర పనుల వివరాలను ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్- 1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఉన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ... ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కులగణన, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిందన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు. పార్టీ నాయకులంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు మాట తప్పకుండా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యమని పేర్కొన్నారు.

రేపటి నుంచి కొనగట్టు బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువుదీరిన శివలింగం

చేవెళ్ల: స్థానికంగా ఉన్న కొనగట్టు శివాలయంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ సున్నపు వసంతం తెలిపారు. ఆయన విలేకర్లతో శుక్రవారం మాట్లాడుతూ.. కొనగట్టు శివాలయంలో మూడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆదివారం గణపతి పూజ, హోమం, అఖండదీపారాధన, ధ్వజారోహనం, శివుడికి రుద్రాభిషేకం, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమార్చన, మంగళ హారతులు, రాత్రి భజన కార్యక్రమం, 17న పునఃపూజ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, 18న రుద్రాభిషేకం, కుంకుమార్చన, భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల ఆశిస్సులు పొందాలన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



బ్రహ్మోత్సవాల్లో మధుసూదన్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్: శివనామస్మరణతో కనకమామిడి సంగమేశ్వర దేవాలయ ప్రాంగణం మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివపార్వతులకు చక్రతీర్థం నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు పెద్దఎత్తున స్వామివారి దర్శనానికి విచ్చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, నాయకులు యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రాజేశ్వరశర్మ వారిని సత్కరించారు.



పూల అలంకరణలో శివలింగం

17న ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



కందుకూరు: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 17న ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరూ మూడు మొక్కల చొప్పున నాటాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్.. హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి, ఆకుపచ్చ తెలంగాణగా మార్చారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టడంతో పచ్చదనం శాతం పెరిగిందని తెలిపారు. కేసీఆర్‌కు బహుమతిగా ఆయన పుట్టిన రోజున మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలుపుదామని సూచించారు.

ఆస్పత్రి పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్: నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, నాలుగైదు నెలల్లో సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. ఆస్పత్రిలో అత్యాధునిక హంగులతో డయాసిస్ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, అశోక్, రమేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, శ్రీధర్, ఫకీర్ బాషా, లక్ష్మీకాంత్‌రెడ్డి, రమేష్, శంకరయ్య, శ్రీనివాస్, ముబారక్, శ్రీశైలం, శేఖర్, కిట్టు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే ప్రశాంతత

నందిగామ: సమాజంలో ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల పరిధిలోని చేగూరులో సాయిబాబా దేవాలయ 16 వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి తమ దైనందిన జీవితంలో ఎంతో కొంత మానసిక ప్రశాంతత అవసరమని, దీనికి తప్పని సరిగ్గా భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, ప్రియాంక, నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్, రాజు, వీరేందర్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.



వృథాగా తాగునీరు.. పట్టించుకోరు..



మిషన్ భగీరథ పైపులైన్ పగిలి రోడ్డుపై వృథాగా పోతున్న నీరు

షాబాద్: మిషన్ భగీరథ పైపులైన్ పలిగిపోవడంతో నీరంతా వృథాగా పారుతోంది. శుక్రవారం మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంలో రెండు రోజులుగా మిషన్ భగీరథ పైపు పగిలిపోవడంతో నీరు వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ నీరంతా గ్రామ సమీపంలో ఉన్న వరి పంటకు వెళుతుందని గ్రామస్తులు అంటున్నారు. కుర్వగూడ రోడ్డుపై నీరు వరదలా పారుతుంది. మిషన్ భగీరథ అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పుల్వామా వీర సైనికులకు నివాళి



శంకర్‌పల్లి: పాఠశాలలో వీర జవాన్లకు నివాళులు అర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు



షాద్‌నగర్: వీర జవాన్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమర వీర సైనికులకు శుక్రవారం కరాటే విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పరిగిరోడ్డులో ఉన్న సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద మైదానంలో న్యూపవర్ కుంగ్‌ఫూ విద్యార్థులు పుల్వామాలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుల త్యాగాలను కొనియాడారు. కుంగ్‌ఫూ అకాడమీ మాస్టర్ అహ్మద్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులు అమర వీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌ఖాన్‌లు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలు మరువలేనివన్నారు.

అమరులను మరవొద్దు



చేవెళ్ల: వీర జవాన్లకు, సుష్మాస్వరాజ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: దేశంలో కోసం తమ ప్రాణాలను త్యాగం చేస్తున్న అమరవీరులను ఎప్పటికీ మరవొద్దని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించారు. అలాగే కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత సుష్మా స్వరాజ్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించాలని నేతలు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: దేశంలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలోని లిటిల్ స్టార్స్ హైస్కూల్, సేవా ఫౌండేషన్‌లలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరులైన వీర జవాన్ల త్యాగాలను ఎప్పటికి మరవకూడదని అన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

హయత్‌నగర్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్నదాతల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తగిన ప్రోత్సాహకాలు కల్పిస్తూ.. దిగుబడికి గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొహెడా పండ్ల మార్కెట్ స్థలంలో తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.3.25 కోట్ల వ్యయంతో నిర్మించిన 5000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రెండు గోదాంలను, 1500 కెపాసిటీ గల కోల్డ్ స్టోరేజిని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన పంటలకు తగిన రేటు వచ్చే వరకు పంటలను నిల్వ చేసుకునేందుకు ఇలాంటి గోదాములు ఎంతగానో ఉపయోగపడతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.